ఆలయంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

జగద్గిరిగుట్ట: చింతల్‌లోని శ్రీసాయి కాలనీ అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నేకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి.

డీలిమిటేషన్ సదస్సుకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


తమిళనాడు సీఎం స్టాలిన్‌తో ఎమ్మెల్సీ

కుత్బుల్లాపూర్: తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో జరిగిన డీలిమిటేషన్ సదుస్సుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో కలిసి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో మాట్లాడారు.

అధికారులూ.. స్పందించరూ!



జగద్గిరిగుట్ట: భవన నిర్మాణ సామాగ్రి మూలంగా నిత్యం రద్దీగా ఉండే సోమయ్య నగర్ ప్రధాన రహదారిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుట్ట ప్రాంతం కావడంతో టిప్పర్ వాహనాలు వెళ్లే సమయంలో కాంక్రీట్, ఇసుక, డస్ట్ ఈ రహదారిలో పడటంతో వాహనాదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. వారం రోజుల్లో 4 ప్రమాదాలు జరిగాయి. బ్రేక్ వేసే సమయంలో తీవ్ర గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా బచ్‌పన్ ప్లే స్కూల్ కాన్వొకేషన్ డే


సర్టిఫికెట్లతో విద్యార్థులు

కుత్బుల్లాపూర్: నాణ్యమైన విద్యతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని బచ్‌పన్ ప్లే స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ పూర్ణిమ అన్నారు. శనివారం చింతల్ వేంకటేశ్వర నగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో యూకేజీ విద్యార్థులకు కాన్వొకేషన్ నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుబాల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పాలనలో విద్యా రంగంలో ఎలాంటి మార్పు రాలేదని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మరింత కుదేలైందని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ రేగోడ్ నగేష్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులను 15 శాతానికి పెంచాలని కోరుతూ శనివారం ఏబీవీపీ మైసమ్మగూడ శాఖ ఆధ్వర్యంలో శనివారం కొంపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ మృత్యుంజయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేంద్ర, భాగ్యనగర కార్యవర్గ సభ్యుడు వివేక్, కార్యకర్తలు వినయ్, కొండల్, శివ పాల్గొన్నారు.

రహదారులపై మురుగు!

రహదారులపై మురుగు పారుతోంది. దుర్గంధంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల కొద్దీ మురుగునీరు పారుతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈగలు, దోమలు వృద్ధి చెంది పగలు, రాత్రి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ ● దుర్వాసనతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు


ఎల్లమ్మబండ గుడ్‌విల్ హోటల్ వద్ద పారుతున్న మురుగు నీరు

ఆల్విన్‌కాలనీ: వీధులన్నీ మురికి కూపంగా మారాయి. డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసన భరించలేక వ్యాపారులు, స్థానికులు తలుపులు మూసుకొని గడపాల్సి వస్తుంది. రహదారులపై మురుగు పారుతుండటంతో వేగంగా వెళ్లే వాహనాల తాకిడికి మురుగు పడి చిన్నపాటి గొడవలకు దారి తీస్తున్నది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్, పాపారాయుడునగర్, ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిలో కొన్ని నెలలుగా మురుగునీరు పొంగి పొర్లుతుంది. అదేవిధంగా ఆల్విన్‌కాలనీ, జలకన్య సెంటర్ నుంచి సాయినగర్‌కు వెళ్లే దారిలోని మూలమలుపు వీధిలో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఎల్లమ్మబండ ప్రధాన రహదారి గుడ్‌విల్ హోటల్ సమీపంలో, ఎల్లమ్మబండ, జయశంకర్ విగ్రహం సమీపంలోని, భాగ్యనగర్ కాలనీ ఉషాముళ్లపూడి రోడ్డును అనుకుని ఉన్న మాధవీనగర్ కాలనీలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. వీధుల్లో మురుగు నిలుస్తోంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీల్లో పర్యటించి డ్రైనేజీ సమస్య జఠిలంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘాల సభ్యులు కోరుతున్నారు.


ఆల్విన్‌కాలనీలో జలకన్య హోటల్ సమీపంలో..


పాపారాయుడు నగర్‌లో ..

నిధులు కేటాయించాలని మంత్రికి వినతి


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని శనివారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపాలిటీని గత ప్రభుత్వం విస్మరించిందని, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో పీఎంఆర్ ఎన్‌క్లేవ్ నుంచి పామ్ మీడోస్ వరకు, శాంతినగర్ కాలనీ వయా అపర్ణ పామ్‌గ్రోవ్ సెప్టిక్ ట్యాంక్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మైకసా స్టెర్లింగ్ రోడ్డు నుంచి అవని గార్డెన్ వరకు, జయభేరి కాలనీలో ఓల్డ్ గోడౌన్ రోడ్డు నుంచి సెంట్రల్ పార్క్ వరకు డ్రైనేజీ లైన్, సీసీ రోడ్లు, ఊరచెరువు సుందరీకరణ తదితర అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అభివృద్ధి చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ఆయన వెంట కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జిమ్మి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనులు ప్రారంభించాలి

బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్: బడ్జెట్ సమావేశాల్లో శనివారం జరిగిన చర్చలో బీఆర్ఎస్ హయాంలో మంజూరైన కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులపై ఎమ్మెల్యే వివేకానంద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీ కోసం 20 ఎకరాల స్థలాన్ని సేకరించిందన్నారు. స్థలం హెచ్ఎండీఏ పరిధిలో ఉండటంతో ఇప్పటికే జీవో కూడా విడుదలైందని, వెంటనే మెడికల్ కాలేజీ పనులను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

భారీ వర్షంతో రోడ్లపైకి వరదనీరు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లో భారీ వృక్షాలు నేల కూలడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. పలు చోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


పోలీసుల అదుపులో కార్మిక సంఘం నాయకులు

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్

జగద్గిరిగుట్ట: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన ఇందిరాపార్క్ ధర్నాకు వెళ్లకుండా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ధర్నాకు ఏఐటీయూసీ నాయకత్వం వెళుతున్నారని ముందస్తు సమాచారంతో శనివారం ఉదయాన్నే పోలీసులు వారిని అరెస్టు చేశారు. అరెస్టైన వారిని సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా, హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్ రావు, కోశాధికారి సాయిలు, సీపీఐ కార్యదర్శి సహదేవరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


కాలనీలో పర్యటిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తున్నామని కాంగ్రెస్ ఎస్ఎంసీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్‌లో పర్యటించారు. వివిధ సమస్యలను స్థానికులు వివరించారు. కమిషనర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

ఎంఎల్ఆర్ఐటీలో మేధో సంపత్తిపై అవగాహనా సదస్సు


తెలంగాణ ఎంఎస్ఎంఈ నోడల్ అధికారి బిస్త్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో శనివారం మేధో సంపత్తిపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ఎంఎస్ఎంఈ నోడల్ అధికారి జి.ఎస్.బిస్త్ ముఖ్య అతిథిగా హాజరై స్టార్టప్‌లు, పేటెంట్ దాఖలు ప్రక్రియ, ఎస్‌సీఐపీపీ పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరణలు, మేధో సంపత్తి విద్యను పెంపొందిస్తున్న ఐపీఎఫ్‌సీ హెడ్ వివేక్ ఆనంద్, ఏరోనాటికల్ హెడ్ ఎంఎస్ఎన్ గుప్తాలు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, తెలంగాణ ప్రభుత్వం జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు విజయ్‌కుమార్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ పోయిందని బాలుడి ఫిర్యాదు

దాతల సాయంతో కొత్త సైకిల్ కొనిచ్చిన ఇన్‌స్పెక్టర్



జీడిమెట్ల: సైకిల్ పోగొట్టుకున్న బాలుడికి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ దాతల సహాయంతో కొత్త సైకిల్‌ను ఇప్పించారు. ఎస్ఐ ప్రేమ్ సాగర్ వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌కు చెందిన సహర్ష్(8) సైకిల్‌ను రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ విషయమై బాలుడు తల్లితో కలిసి జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సైకిల్‌పూర్తిగా ధ్వంసం అయిన స్థితిలో ఉందని కనుగొన్నారు. బుడ్డోడికి పాడైన సైకిల్ ఇస్తే బాధపడతాడేమోనని సీఐ దాతల సహాయంతో బాలుడికి శనివారం జీడిమెట్ల పీఎస్‌లో కొత్త సైకిల్‌ను అందజేశారు.

ముదిరాజ్‌లను బీసీ(ఏ)లోకి మార్చాలి

రంగారెడ్డినగర్: అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని, ముదిరాజ్‌లను బీసీ(ఏ) లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఉదయ్ గంజి అన్నారు. శనివారం ముదిరాజ్ యువజన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ ఎన్నో ఏళ్లుగా జీవో 15 అమలు కోసం ఎదురు చూస్తున్నారని, ఈ జీవో అమలులోకి వస్తే బీసీ డీ నుంచి బీసీ ఏకు ముదిరాజ్ కులస్తులు మారతారన్నారు. కమిటీ హాల్ నిర్మాణం, పోరాటయోధులు పండగ సాయన్నముదిరాజ్, కొరివి కృష్ణస్వామి ముదిరాజ్‌ల విగ్రహావిష్కరణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో రామకృష్ణ, ఆంజనేయులు, వేణు, మధు, కోట సందీప్, పొల్కం విగ్నేష్, ప్రదీప్, శరత్, మన్నే అరవింద్, క్రాంతి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

నీటిని రేపటి తరానికి అందించాలి


ఇంకుడు గుంతను తవ్వుతున్న ఎస్‌పీఆర్ ట్రస్ట్ చైర్మన్ పున్నారెడ్డి

సుభాష్‌నగర్: ప్రతి నీటిబొట్టును ఆదా చేసి రేపటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్‌పీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజులరామారం డివిజన్ చిత్తారమ్మదేవినగర్ లో ఎస్‌పీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 ఇంకుడు గుంతలకు స్థానికులతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిని పొదుపు చేయకపోవడంతో పెరిగిన జనాభాకు సరిపడా నీరు అందక ఇప్పటికే జనం అల్లాడుతున్నారని తెలిపారు. భవిష్యత్‌లో నీటి ఎద్దడి రావద్దు అంటే ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి వెళ్లే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జగద్గిరిగుట్ట, సూరారం, గండి మైసమ్మ, నిజాంపేట్ ప్రాంతాలలో 1200 ఫీట్ల మేరా బోరు వేసినా నీటి జాడలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేటప్పుడు నీరు కావాలంటే కేవలం రెండు అడుగులు తవ్వి నీటిని ఉపయోగించుకునేవారని, మానవుని నిర్లక్ష్యంతో నేడు అదే నీరు పాతాళానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి వృథాపై అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు



నీటి సంరక్షణపై అవగాహన

నిజాంపేట్ : ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం యూత్ ఫర్ సేవ వాలంటీర్ల ఆధ్వర్యంలో నీటి సద్వినియోగం, నీటి కాలుష్య నివారణ, వాన నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ.. ప్రాణవాయువు తరువాత నీరే మనకు ప్రాణాధారమని, మనకున్న నీరు పరిమితమని అన్నారు. వృథా చేయకుండా నీటిని పరిమితంగా వాడుకోవాలని సూచించారు. వాన నీటిని సంరక్షించి, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పక్షుల నీటి అవసరాలకై నిజాంపేట్ కార్పొరేషన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న చెట్లకు నీటి కుండీ (ఉట్టీ)లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, శ్రీనివాస్ భరత్‌ముఖ్, సత్య కాటేపల్లి, కల్యాణి, భారతి, రామనారాయణ, లక్ష్మీ రామారావు, నవీన్, చంద్ర, మధు, శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్ : సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దమ్మని శ్రవణ్ కుమార్, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కొలన్ వీరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్


జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

దుండిగల్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ అన్నారు. శనివారం సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ బ్యాన్ నేపథ్యంలో దుండిగల్ మున్సిపల్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించి పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా బట్ట, జూట్ బ్యాగ్‌లను వాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాచుపల్లి సీఐ ఉపేంద్రకు ప్రశంసాపత్రం



నిజాంపేట్: బాచుపల్లి సీఐ ఉపేందర్ తన విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు శనివారం సైబరాబాద్ కమిషనర్ చేతుల మీదుగా ఉత్తమ సీఐగా ప్రశంసాపత్రం అందుకున్నారు. రెండు హత్య కేసుల్లో సాక్షాధారాలను పకడ్బందీగా కోర్టుకు సమర్పించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు


కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింహరాజు

బాలానగర్: బాలానగర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ క్యాపిటల్ భవనంలో యాక్షన్ గ్రూపు సంస్థ కార్యాలయం సెక్యూరిటీ గార్డులకు శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి సీఐ టి నర్సింహరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార సేకరణకు సైతం సిద్ధంగా ఉండాలని సూచించారు. కేవలం విధులు మాత్రమే నిర్వహించకుండా వారి కుటుంబంలోని పిల్లల విషయమై కూడా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులకు, సెక్యూరిటీ గార్డ్ వ్యవస్థకు చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయని వివరించారు. అనంతరం యాక్షన్ ఫోర్స్ సెక్యూరిటీ సంస్థ చైర్మన్ సుభాని అబ్దుల్ మాట్లాడుతూ.. ఫైర్ సేఫ్టీ యంత్రాలను ఎలా వాడాలో తప్పకుండా శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాత్రి వేళల్లో విధుల నిర్వహణలో సెక్యూరిటీ గార్డులు నిద్రపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అబ్దుల్ యుసుఫ్, బాలానగర్ ఎస్ఐ మహ్మద్ హాజీ మియా, సూపర్‌వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

ఆల్విన్‌కాలనీ: ఆయా డివిజన్‌లలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తీ కాలనీలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ చిన్న సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కాలనీలను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్